విశ్వకర్మలు ఐక్యంగా ఉంటేనే ప్రభుత్వాలు గుర్తిస్తాయి

ఎంపీ ఈటల రాజేందర్‌

దిల్‌సుఖ్‌నగర్‌: విశ్వకర్మలు ఐక్యమత్యంగా ఉంటేనే ప్రభుత్వాలు గుర్తించి ప్రాధాన్యం ఇస్తాయని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ అన్నారు. కొత్తపేటలోని బాబూ జగ్జీవన్‌రామ్‌ భవనంలో జరిగిన అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో దాదాపు 25 లక్షల జనాభా ఉన్న విశ్వకర్మ సామాజిక వర్గం వారి కులవృత్తుల ఆధారంగానే జీవనాన్ని సాగిస్తుంటారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వస్తే వృత్తులకు తోడ్పాటు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తారని ఆశ పడ్డారని, గత తొమ్మిదేళ్ల కాలంలో పాలకులు విశ్వకర్మ, విశ్వ బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించారన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు కౌలే జగన్నాథం మాట్లాడుతూ.. విశ్వకర్మ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ ఏర్పాటు చేసి రూ. 1000 కోట్ల బడ్జెట్‌ కేటాయించాలన్నారు. 55 ఏళ్లు నిండిన వృత్తి కళాకారులకు రూ. 5వేల పింఛన్‌ ఇవ్వాలన్నారు. ప్రతిభ కనబరిచిన విశ్వకర్మ చేతి వృత్తుదారులకు సెప్టెంబర్‌ 17 విశ్వకర్మ జయంతి సందర్భంగా గౌరవప్రద పురస్కారాలు ఇవ్వాలని అన్నారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అధ్యక్ష కార్యదర్శులను ఘనంగా సన్మానించారు. చెదిలాల్‌ శర్మ, పైలేష్‌ కుమార్‌, దినేష్‌ బాయ్‌ శర్మ, ఎం.ఎ. శర్మ, మనోరంజన్‌, జ్యోతిరమణ, బీజేపీ రంగారెడ్డి అర్బన్‌ అధ్యక్షులు సామ రంగారెడ్డి, ఆర్‌కేపురం కార్పొరేటర్‌ రాధా ధీరజ్‌రెడ్డి, కొత్తపేట కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌కుమార్‌, నాయకులు రాజశేఖర్‌, కృష్ణ గంజ్‌, జంగయ్యచారి, సతీష్‌, మురళీధర్‌చారీ, సూర్యనారాయణ గులాబ్‌ శర్మ పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌

పేదల పక్షాన పోరాడే ఏకైక పార్టీ సీపీఐ


పార్టీ జెండా ఎగురవేసిన షేక్‌ మహమూద్‌

సైదాబాద్‌: పేద ప్రజల పక్షాన నిరంతరం పోరాటాలు చేసే ఏకైక పార్టీ సీపీఐ అని ఐఎస్‌సదన్‌ డివిజన్‌ పార్టీ కార్యదర్శి షేక్‌ మహమూద్‌ అన్నారు. సీపీఐ పార్టీ 100వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం సింగరేణి కాలనీలో ఆయన పార్టీ నాయకులతో కలిసి సీపీఐ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడైనా ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ నాయకులు పోరాడుతూనే ఉన్నారన్నారు. ఐఎస్‌సదన్‌ డివిజన్‌ సింగరేణి కాలనీలో సైతం సీపీఐ పార్టీ చొరవతోనే వేల సంఖ్యలో పేద ప్రజలు గుడిసెలు వేసుకొని మూడు దశాబ్దాలుగా జీవిస్తున్నారన్నారు. సింగరేణి కాలనీలో నివసించే నిరుపేదలకు ఇక్కడే ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసే వరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్‌ నాయక్‌, అంజయ్య, దశరథ్‌ నాయక్‌, రాజు నాయక్‌, అజయ్‌, ముత్యాలి, రేష్మ, అనూష, ఇబ్రహీం, హరి నాయక్‌ పాల్గొన్నారు.

జైపురికాలనీలో..

నాగోలు: పేద ప్రజలకు ఎర్రజెండా అండగా ఉంటుందని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నాగోలు డివిజన్‌ జైపురికాలనీ శాఖ సెక్రెటరీ ఎండీ. బషీర్‌ అన్నారు. పార్టీ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జైపురికాలనీలో శుక్రవారం ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో ఏ పార్టీ కన్నా వందేళ్ల చరిత్ర ఉందంటే అది కేవలం భారత కమ్యూనిస్టు పార్టీ ఒక్కటే అన్నారు. స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో అనేక మంది ప్రాణ త్యాగాలు చేసిన వీర చరిత్ర పార్టీ అన్నారు. ఈ కార్యక్రమంలో రాసమల్ల రాజేందర్‌, మల్లేష్‌, శ్రీధర్‌ రెడ్డి, రాజమల్లయ్య, అశోక్‌ పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరణలో పార్టీ నాయకులు

మల్లికార్జునస్వామి దేవస్థానం అందరిదీ


సమావేశంలో పాల్గొన్న సంక్షేమ సంఘం, ఆలయ కమిటీ ప్రతినిధులు

వనస్థలిపురం: వనస్థలిపురం ఎల్‌ఐజీ బీబ్లాక్‌ ఫేస్‌–1లోని శ్రీ భ్రమరాంబికా మల్లికార్జునస్వామి దేవస్థానం అన్ని కులాలకు సంబంధించినదని ఆలయ ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాలనీ సంక్షేమ సంఘం, ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడారు. ఈ దేవస్థానం కేవలం వీరశైవ లింగాయత్‌లకు చెందినదని కొందరు వేరే కమిటీ ఏర్పాటు చేసుకుని హంగామా చేస్తున్నారని, ఇది పద్ధతి కాదన్నారు. దేవాలయాల అభివృద్ధికి కులాలకు అతీతంగా స్థానికులు దాదాపు 200 మంది విరాళాలు ఇచ్చారని అన్నారు. ప్రస్తుతం కూడా పాత కార్యవర్గం ఆధ్వర్యంలోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ గౌరవ చైర్మన్‌ మణిశేఖర్‌, అధ్యక్షుడు గాండ్ల అంజయ్య, కార్యదర్శి పురుషోత్తం, ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, కోశాధికారి ఉప్పు వెంకటేష్‌, నరేంద్ర కుమార్‌, శీనయ్య, అశోక్‌కుమార్‌, మహేష్‌, సత్యమూర్తి, వేణుమాధవ్‌ పాల్గొన్నారు.

అక్బర్‌బాగ్‌లో సభ్యత్వ నమోదు


సభ్యత్వ పత్రాలు అందజేస్తున్న శ్రుతి

మలక్‌పేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరేలా, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి అన్నారు. అక్బర్‌బాగ్‌ డివిజన్‌లో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆమె, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డితో కలిసి పాల్గొని సభ్యత్వ పత్రాలు అందజేశారు. ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారం కోసం పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వినోద్‌కుమార్‌, నర్సింహా, గజానంద్‌ పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్‌ మేళాకు స్పందన

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా కమ్యూనిటీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్‌ ఇండియా హ్యాండ్లూమ్‌ హ్యాండీక్రాఫ్ట్‌ మేళాకు స్పందన వస్తోందని నిర్వాహకులు అక్బర్‌అలీ పేర్కొన్నారు. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్‌, డిజైనర్‌, కాంతా వర్క్‌, హ్యాండ్‌ బ్లాక్‌ ప్రింటెడ్‌, లినెన్‌, కలంకారీ, బెంగాల్‌ కాటన్‌, లక్నో చికాన్‌, బనారస్‌ చీరలు, ఖాదీ మెటీరియల్‌, వన్‌ గ్రామ్‌ గోల్డ్‌ జ్యూవెలరీ తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయన్నారు.


మేళాలో కొనుగోలుదారుల సందడి


ఎల్‌బీనగర్‌లో నివాళి అర్పిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి


మన్మోహన్‌ సింగ్‌ చిత్రపటానికి నివాళులర్పించిన కోట్ల శ్రీనివాస్‌

ఆర్థిక సంస్కరణల ఆద్యుడు.. మన్మోహన్‌సింగ్‌

హస్తినాపురం: మాజీ ప్రధానమంత్రి, ఆర్థిక సంస్కరణల ఆద్యుడు మన్మోహన్‌సింగ్‌ మరణం దేశ ప్రజలకు తీరని లోటని తెలంగాణ ప్రదేశ్‌ కాంగ్రెస్‌ సేవాదళ్‌ అధ్యక్షులు మిద్దెల జితేందర్‌, హస్తినాపురం డివిజన్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎల్‌బీనగర్‌ నియోకవర్గంలోని చంపాపేట, హస్తినాపురం డివిజన్‌ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మన్మోహన్‌సింగ్‌ చిత్రపటాలకు నివాళులర్పించారు.

ఎల్‌బీనగర్‌ చౌరస్తాలో..

లింగోజిగూడ: దేశమాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ మృతి దేశానికే తీరని లోటని కాంగ్రెస్‌ నాయకులు పేర్కొన్నారు. ఎల్‌బీనగర్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్‌బీనగర్‌ చౌరస్తాలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద మన్మోహన్‌ సింగ్‌ చిత్రపటానికి రాష్ట్ర రోడ్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ మల్‌రెడ్డి రాంరెడ్డి, సేవాదళ్‌ అధ్యక్షులు మిద్దెల జితేందర్‌ రెడ్డి, లింగోజిగూడ కార్పొరేటర్‌ దర్పల్లి రాజశేఖర్‌ రెడ్డి, కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు ముద్దగోని రామ్మోహన్‌ గౌడ్‌, సంకేపల్లి సుధీర్‌ రెడ్డి, జక్కిడి ప్రభాకర్‌ రెడ్డి, వజీర్‌ ప్రకాష్‌ గౌడ్‌ మన్మోహన్‌సింగ్‌ చిత్రపటానికి నివాళులర్పించారు.

వనస్థలిపురం కాంప్లెక్స్‌లో..

వనస్థలిపురం: భారతదేశ మాజీప్రధాని మన్మోహన్‌ సింగ్‌ మృతి పట్ల సంతాపం ప్రకటిస్తూ వనస్థలిపురం కాంప్లెక్స్‌లో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. భారతదేశం గొప్ప మేధావిని కోల్పోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌ యాదవ్‌, రామారావు, అశోక్‌గౌడ్‌, సత్యనారాయణ, నికేష్‌, శ్రీనివాస్‌ యాదవ్‌, స్వర్ణమాధవి, మహేందర్‌ యాదవ్‌ పాల్గొన్నారు.

శ్రీ రామకృష్ణాపురం చౌరస్తాలో..

దిల్‌సుఖ్‌నగర్‌: మహేశ్వరం నియోజవర్గం శ్రీ రామకృష్ణాపురం చౌరస్తాలో డివిజన్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్‌ నేత ఆధ్వర్యంలో మాజీ ప్రధాని, ఆర్థికవేత్త, డాక్టర్‌ మన్మోహన్‌ సింగ్‌ చిత్రపటానికి నాయకులు ఉపేందర్‌ రెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్‌ కమిటీ సభ్యులు మధుసూదన్‌ రావు ఖిల్లా మైసమ్మ చైర్మన్‌ సురేష్‌ కుమార్‌, రవీంద్ర, రమేష్‌ నేత, శివ, దుర్గాప్రసాద్‌, భూపాల్‌ రెడ్డి, జగన్నాథం నివాళులర్పించారు.


చంపాపేటలో మన్మోహన్‌సింగ్‌ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు


హస్తినాపురం జిల్లా పరిషత్‌ రోడ్డు వై జంక్షన్‌లో..

ఐఎస్‌సదన్‌ డివిజన్‌లో..

సైదాబాద్‌: తన రాజకీయ జీవితంలో ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకుండా మచ్చలేని నాయకుడిగా పేరొందిన దేశ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ నేటి తరం నాయకులకు ఆదర్శంగా నిలుస్తారని హైదరాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ కోట్ల శ్రీనివాస్‌ అన్నారు. శుక్రవారం ఐఎస్‌ సదన్‌ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి మన్మోహన్‌ సింగ్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రవిరాజ్‌, కోట్ల లడ్డూపటేల్‌, శివయాదవ్‌, శివ, గన్ని, వెంకటమ్మ, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.


వనస్థలిపురం కాంప్లెక్స్‌లో కొవ్వొత్తులతో నివాళి


శ్రీ రామకృష్ణాపురం చౌరస్తాలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

సీఎంఆర్‌ఎఫ్‌ పేదలకు వరం


ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్‌: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన సంతోషికి సీఎంఆర్‌ఎఫ్‌ నుంచి మంజూరైన రూ. 1.25 లక్షల ఎల్‌ఓసీ పత్రాలను శుక్రవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో నగేష్‌, వెంకటేష్‌, వలిగొండ దీపు, శ్రీకాంత్‌ ,నవీన్‌, పాండు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్‌: ఆరోగ్యానికి మించిన సంపద లేదని హయత్‌నగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. బీడీఎల్‌ కాలనీలో వెల్‌నెస్‌ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించాలని, తరుచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరానికి హాజరైన వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఇర్ఫాన్‌, సనా, నాయకులు గోవిందాచారి, అచ్చిరెడ్డి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మలక్‌పేట: మహిళలు ఆర్థికంగా ఎదగాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్‌ బలాల అన్నారు. మూసారంబాగ్‌ డివిజన్‌ సలీంనగర్‌లోని సలీంఖాన్‌ కమ్యూనిటీహాల్లో ఉచిత టైలరింగ్‌ సెంటర్‌లో 100 మంది మహిళలకు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజవర్గ పరిధిలోని పేద మహిళలకు చేయూత అందించడానికి కుట్టుమిషన్‌ శిక్షణ, మిషన్ల పంపిణీ చేస్తున్నామన్నారు. శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్‌తో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి నజీమా, తదితరులు పాల్గొన్నారు.


కుట్టు మిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

అత్యాచారం కేసులో వ్యక్తికి 20 ఏళ్ల జైలు

సైదాబాద్‌: బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5 వేల జరిమానా విధించారు. సైదాబాద్‌ ఇన్‌స్పెక్టర్‌ రాఘవేందర్‌ వివరాల ప్రకారం..సైదాబాద్‌ పూసలబస్తీలో నివసించే అమిందాల భార్గవ్‌కుమార్‌ అలియాస్‌ చింటూ (36) ఓలా బైక్‌ రైడర్‌గా పని చేసే వాడు. అతడికి వివాహమై ఒక కొడుకు ఉన్నాడు. 2019లో తన ఇంట్లో అద్దెకున్న కుటుంబానికి చెందిన బాలికను మాయమాటలతో లొంగదీసుకొని పలుమార్లు అత్యాచారం చేశాడు. రెండు సార్లు యాదగిరిగుట్టకు సైతం తీసుకెళ్లాడు. బాలికతో సన్నిహితంగా ఉన్న ఫొటోలను బాలిక తండ్రికి చూపించి తమకు పెళ్లి చేయాలని బెదిరించాడు. వేధింపులు తాళలేక బాధిత బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సైదాబాద్‌ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. కేసు విచారించిన హైదరాబాద్‌ 12వ అడిషనల్‌ సెషన్స్‌ జడ్జి టి.అనిత శుక్రవారం అమిందాల భార్గవ్‌కుమార్‌కు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.


అమిందాల భార్గవ్‌కుమార్‌

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్‌: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నామని సరూర్‌నగర్‌ డివిజినల్‌ ఇంజినీర్‌ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ భగత్‌సింగ్‌నగర్‌, జేబీకాలనీ, బ్యాంక్‌కాలనీ, పోస్టాఫీసు, శివపురికాలనీ, లింగోజిగూడ ఫీడర్ల పరిధి కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11కేవీ అష్టలక్ష్మి, స్వాతిరెసిడెన్సి, ఫీడర్ల కింది కాలనీల్లో ఉదయం 10.30 నుంచి 11.30 వరకు. 11కేవీ విజయపురి, రాఘవేంద్రకాలనీ, లెక్చరర్స్‌ కాలనీ ఫీడర్ల పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు, 11కేవీ శివంహిల్స్‌ ఫీడర్‌ పరిధి ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, 11కేవీ విద్యుత్‌నగర్‌ ఫీడర్‌ పరిధి కాలనీల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు, 11కేవీ సిరినగర్‌, శివగంగకాలనీ, హరిపురి ఫీడర్ల పరిధిలో మధ్యా హ్నం 12 నుంచి 1 గంట వరకు, 11కేవీ ఆర్‌కేపురం, చిత్ర లేఅవుట్‌, సాయికాలనీ ఫీడర్ల పరిధిలో మ ధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 వరకు, 11కేవీ వాంబేకాలనీ, వి–గార్డ్‌ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 11కేవీ స్టేడియం, హయత్‌నగర్‌ ఫీడర్ల పరిధి కాలనీలలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు, 11కేవీ కల్వంచ ఫీడర్‌ పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాను నిలిపివేయనున్నట్లు రామకృష్ణ పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పహాడీషరీఫ్‌లో..

పహాడీషరీఫ్‌: జల్‌పల్లి మున్సిపాలిటీలోని వాదే హుదా సబ్‌ స్టేషన్‌ పరిధిలో మరమ్మతుల కారణంగా పలు బస్తీలలో శనివారం ఉ.10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ ఎల్‌.వి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. క్యూబా కాలనీ, క్యూబా మజీద్‌, నహదీ హోటల్‌, వాదే హదీస్‌, ముస్తఫా హిల్స్‌, అహ్మద్‌ అశ్రఫ్‌ కాలనీ, ఝుంఝుం హోటల్‌ లేన్‌, మహ్మద్‌నగర్‌, మదీనా కాలనీ, మునీర్‌ మజీద్‌, అలీ నగర్‌, జమీల్‌ కాలనీ, ఎర్రకుంట, సాదత్‌నగర్‌, ఒవైసీ కాలనీ, గ్రీన్‌సిటీ, వాదే సాల్హె హీన్‌, అల్‌ జాబ్రీ కాలనీలలో సరఫరాను నిలిపివేయనున్నామని వెల్లడించారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్‌, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు.. టమాట రూ.11, వంకాయ రూ. 23, బెండ రూ. 23, పచ్చిమిర్చి రూ. 35, కాకర రూ. 23, బీర రూ. 35, క్యాబేజి రూ. 13, ఫ్రెంచిబీన్స్‌ రూ. 40, క్యారట్‌ రూ. 28, దొండ రూ. 23–40, చిక్కుడు రూ. 45, గోకర రూ. 35, బీట్‌రూట్‌ రూ. 35, క్యాప్సికం రూ. 45, ఆలు రూ. 25, దోస రూ. 15, సొరకాయ రూ. 9, పొట్లకాయ రూ. 13, ఉల్లిగడ్డ రూ. 34, చామగడ్డ రూ. 35. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నియామకం


యిర్మియా

మలక్‌పేట: నేషనల్‌ క్రిస్టియన్‌ జాయింట్‌ యాక్షన్‌ కమిటీ అధికార ప్రతినిధిగా మలక్‌పేటకు చెందిన పాస్టర్‌, రెవరెండ్‌ కూనదొడ్డి యిర్మియాను నియమిస్తూ నేషనల్‌ చైర్మన్‌ రెవరెండ్‌ డాక్టర్‌ రొనాల్డ్‌ జాన్‌ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా, మండల, డివిజన్‌ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి క్రిస్టియన్‌ జేఏసీ బలోపేతం, క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన నరేష్‌కుమార్‌

హయత్‌నగర్‌: అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హయత్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హయత్‌నగర్‌ డివిజన్‌ విష్ణునగర్‌ కాలనీకి చెందిన సకినాల నరేష్‌ కుమార్‌ (36) మెడికల్‌ ఫీల్డ్‌లో వ్యాపారం చేస్తున్నాడు. భార్య ప్రియాంక, ఓ కొడుకు, కూతురు ఉన్నారు. వ్యాపారంలో నష్టం రావడంతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తాయి. శుక్రవారం ప్రియాంక డ్యూటీ నిమిత్తం బయటకు వెళ్లగా నరేష్‌కుమార్‌ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

గృహిణి అదృశ్యం


పారిజాత

హయత్‌నగర్‌: భర్తతో గొడవపడి ఓ గృహిణి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. హయత్‌నగర్‌ నందిహిల్స్‌ కాలనీలో బద్దుల సతీష్‌, పారిజాత(34) దంపతులు నివాసముంటున్నారు. వీరి నడుమ తరచూ గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం మరోసారి గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన పారిజాత ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. ఆందోళనకు గురైన భర్త సతీష్‌, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


సాయికుమార్‌(ఫైల్‌)

హయత్‌నగర్‌: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన హయత్‌నగర్‌ పోలీస్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సూర్యాపేట్‌ జిల్లా ఏపూరి గ్రామానికి చెందిన నవీళ్ల సాయికుమార్‌(25) చదువుకుంటూ పెయింటింగ్‌ పని చేస్తూ హయత్‌నగర్‌ డివిజన్‌ సాహెబ్‌నగర్‌ కాలనీలో నివాసముంటున్నారు. ఈ నెల 19న రాత్రి తన స్నేహితుడు మంజునాథ్‌తో కలిసి బైక్‌పై సామానగర్‌ నుంచి భాగ్యలత వైపు వస్తున్నారు. శాంతినగర్‌ వద్దకు రాగానే ఏకుల శ్రీధర్‌ అనే వ్యక్తి తన కారును నిర్లక్ష్యంగా నడుపుతూ వీరి బైక్‌ను ఢీకొట్టడంతో సాయికుమార్‌, మంజునాథ్‌ కిందపడిపోయారు. తీవ్రంగా గాయపడిన సాయికుమార్‌ను నీలాద్రి ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు.



నిర్వహణ లేక నిరుపయోగం

మినీ ట్యాంక్‌బండ్‌గా పేరొందిన సరూర్‌నగర్‌ చెరువు కట్టపై ఏర్పాటు చేసిన పబ్లిక్‌ టాయిలెట్స్‌పై నిర్వహణ లేకపోవటంతో నిరుపయోగంగా మారాయి. మినీ ట్యాంక్‌బండ్‌ వద్దకు వచ్చే సందర్శకుల కోసం కొన్నేళ్ల క్రితం రెండు ప్రాంతాల్లో ఏర్పాటు చేసి టాయిలెట్స్‌ మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. టాయిలెట్‌, వాష్‌ బేసిన్లు పగిలిపోగా ట్యాప్‌లు ధ్వంసమయ్యాయి. నిత్యం అక్కడికొచ్చే సందర్శకులకు సరైన వసతులు లేక అసౌకర్యానికి గురవుతుంటారు. వినాయక నిమజ్జనం సమయంలో మాత్రం తాత్కాలికంగా మొబైల్‌ టాయిలెట్స్‌ ఏర్పాటు చేస్తున్నారు కానీ.. రూ. వేలల్లో ఖర్చుచేసి నిర్మించిన టాయిలెట్‌ల మరమ్మతుపై అధికారులు దృష్టి సారించకపోవడంతో సందర్శకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. –చైతన్యపురి

నిర్లక్ష్యంతో ప్రమాదకరం

హస్తినాపురం డివిజన్‌ పరిధిలోని సాగర్‌ఎన్‌క్లేవ్‌ కాలనీలో నిర్మించిన ట్రంక్‌లైన్‌ నిర్మాణంపై గత కొన్ని నెలలుగా పైకప్పు లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈ రహదారిపై వాహనదారులు ప్రయాణించాలంటేనే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని కాలనీవాసులు వాపోతున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో స్థానికులే చెక్కలు, కట్టెలు ఏర్పాటు చేశారు. ఈ రహదారి గుండా రాకపోకలు సాగించే క్రమంలో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుందని సంబంధిత అధికారులు స్పందించి ట్రంక్‌లైన్‌ నిర్మాణంపై పైకప్పు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. –హస్తినాపురం

